# వేసవిలో వసంతం

"అమల స్వభావం నాకంటే నీకే బాగా తెలుసు. అది మీ ఇంట్లో తప్పకుండా దిగుతుంది. నువ్వే దానికి నచ్చజెప్పగల దానివి. మీ స్నేహం నేను ఎరగంది కాదు....!"

ఏ పని చేస్తున్నా పిన్ని వ్రాసిన ఉత్తరంలోని ఈ మాటలు నన్ను వెంటాడుతూనే వున్నాయి. ఉత్తరంతో పాటే టెలిగ్రాం కూడా అందింది. రేపొద్దుటే దిగుతుంది అమల. నేనేం చేయాలో యిప్పటికీ తేల్చుకోలేక పోయాను.

"ఏమిటీ! మీ అక్కయ్య దిగుతోందా?!".... రామకృష్ణకేకా, వెనువెంటనే ఈలా వినిపించాయి. ఏం మాట్లాడను. పిన్ని ఉత్తరం వ్రాయకముందే రామకృష్ణ, "మీ అక్కయ్య ఏం చేస్తోందో చూశావా....!" అంటూ పెద్ద పురాణం చెప్పుకొచ్చాడు. మొన్నటి క్యాంపులో యిద్దరూ కలిశారట! తనతో.... ఓ గంట కాలక్షేపం చేయటానికి కూడా అమలకు తీరిక లేదట. ఆవిడంతా చాలా పెద్దవాళ్ళని పట్టేసిందట! "ఇక మనబోటి వాళ్ళతో తనకు పనేమిటిలే" —అంటూ తేల్చాడు. అతని ఉక్రోషం ఎందుకో అర్థం కాలేదు. ఒక గంట తనతో కాలక్షేపం చేయనందుకా?? పెద్దవాళ్ళను పట్టేసినందుకా??! అసలు విజం చెప్పాలంటే అమలకు ఎవరి సహాయమూ అక్కర్లేదు. అది ఎవరితోనూమాట్లాడనక్కరలేదు. పెద్ద బ్యాంక్ ఆఫీసర్ ఆమె తనకేం! ఇదే మాట రామకృష్ణతో అంటే కోపం తెచ్చుకుంటాడు. అమలను ఏదోఒకటి అనకుండా మానడు. ఎందుకు అనవసరంగా దాన్ని అనిపించటం. అందుకే విని ఊరుకొన్నాను. అసలు సమస్య ఇప్పుడొస్తుంది. పిన్ని వ్రాసిన ఉత్తరానికి నేను బదులిచ్చి తీరాలి. అమల గురించి వాళ్ళకేం తెలుసని ఆమె బాగోగులు చర్చిస్తారు వీళ్ళు. వాళ్ళకు తెలిసినంతవరకూ అమల యింటికి పెద్దది. మగపిల్లాడిలా తండ్రి పోయాక ఇంటి బాధ్యత నెత్తికెత్తుకుని తమ్ముడిని, చెల్లెల్ని చదివించింది. ఇప్పుడు అందరికీ రెక్కలు వచ్చాయి. అయితే అదీ ఒక మనిషేనని, దానికీ ఓ మనసుంటుందనీ మరచిపోయారు వీళ్ళు. ఇప్పటికీ దాని బతుకుని శాసించాలని చూస్తారు. అసలు వాళ్ళకేం హక్కుందీ!

"రేపు మీ అక్క కోసం ఏమేం స్పెషల్స్ చేస్తున్నావోయ్!" రామకృష్ణ కళ్ళు మెరిపిస్తూ అడుగుతున్నాడు.

"రేపు తను వచ్చాక తనకు ఏం యిష్టమయితే అవి...." అన్నాను నవ్వేస్తూ. అంతకంటే యింకేం అనగలను మరి?!

రామకృష్ణ యింట్లో ఉన్నంతసేపూ హడావిడి చేస్తూనే ఉంటాడు. తను ఆఫీసుకి వెళ్ళిపోతే అంతా విశ్రాంతే. ఏం చేయాలో తోచదు నిద్రపోవడం తప్ప. అమల అయితే ప్రతి నిముషం విలువైందేనంటుంది. తన ఆఫీసు, లేకపోతే పుస్తకాలు ఇదీ దాని లోకం. పిన్ని ఉత్తరంలో ఈ విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది.

"....దానికి పాపం ఏం తోస్తుంది. కళ్ళు పాడయ్యేలా ఆ పుస్తకాలు పారాయణం చేస్తుంటుంది. చెల్లెలి కూతుర్నో తమ్ముడి కొడుకునో తన దగ్గర పెట్టుకొంటానంటే వాళ్ళు కాదన్నారా! ఆ మధ్య రామం అన్నాడు కూడా, బాబుని అక్క దగ్గరే ఉంచేద్దామనుకొంటున్నాం, ఎటూదానికి కాలక్షేపంగా ఉంటుందని. ఈమాటంటే అది ఎంత నవ్విందో తెలుసా! నవ్వింది కాని సమాధానం చెప్పదే! దాని మనసులో ఏముందో ఆ పరమాత్ముడికి తెలియాలి...." ఉత్తరం నాకు కంఠస్తం అయిపోయింది.

నాకు కళ్ళనీళ్ళు వచ్చాయి అమల నవ్విందని చదవగానే. ఆ నవ్వులో అదెంత దుఃఖం దాచుకుందో పాపం. ఈ నలభై ఏళ్ళ జీవితం తరువాత దానికి మిగిలింది. కృష్ణా—రామా అనుకుంటూ వాళ్ళ పిల్లల్ని సాకటమేనా! ఆ రామం గాడికి బుద్ధిలేదు?! పాపం నవ్వక ఏం చేస్తుంది? ఏడవటం రాదు దానికి! ఈ క్షణంలో అమలను చూడాలనిపించింది. ఈ రాత్రి గడిచి తెల్లారాకగానీ తన దర్శనం అవదే!

ఎవరో తలుపులు బాదేస్తున్నారు. తలుపు తీయగానే ఎదురుగా అనంతం మామయ్య!!

"ఏంజేస్తున్నావే! గంటనుంచి అంతలా అరుస్తూంటే...."-అన్నాడు. మళ్ళీ వర్ధనలు, మర్యాదలు ఊపిరి తిరక్కుండా పని. కాసేపటికి రామకృష్ణ కూడా వచ్చేశాడు. తీరిగ్గా కబుర్లు మొదలుపెట్టాడు మామయ్య.

అమల వస్తుందని తెలిసే తనూ వచ్చాడట! అమల చేసిన పని గురించి తెలిశాక, ఆయనకు తేళ్ళు,జెర్రులు పాకినంత అసహ్యం వేసింది ఇంత వయసొచ్చి యిప్పుడు యిదేంపని అంటున్నాడు నోరు నొక్కుకుని. రామకృష్ణ వంతవలుకు

తున్నాడు ఒకవైపు. ఇద్దరూ కలిసి అమల బాగోగుల గురించి చర్చించారు. ఏతావాతా తేల్చిందేమిటంటే. అమల అంతగా కావాలంటే అనంతం మామయ్య ఇంట్లోనే ఉండొచ్చట! ఆయన పిల్లలు చేతికి అందిరాక నానా అవస్థా పడుతున్నాడట, ఈ మాటలు వింటున్న రామకృష్ణ ముఖం కాస్త తెల్లబోయినట్లు కనిపించింది. విషయం అటువైపు వెళుతుందని ఊహించి ఉండడు. అనంతం మామయ్య ఎలిమెంటరీ స్కూలు హెడ్ మాస్టరు. ఆయన దగ్గరే అమల, నేనూ యిద్దరం చదువుకొన్నాం. సొంత మేనకోడళ్ళని కూడా చూడకుండా ఆయన ఎన్నోసార్లు నన్ను, అమలనూ చితకతన్నే వాడు. అంత కోపిష్ఠి. ఆయన తన్నిన తన్నులవల్లే అమల లెక్కల్లో ఫస్ట్, ఈయన కబుర్లు వింటే అమల ఏమంటుందో, నాకు నవ్వొచ్చింది.

"ఏవే అమ్మాయీ.... ఏం చేద్దాం"- అంటున్నాడాయన.

అమల నా గుప్పిట్లో ఉన్నట్లు. "ముందర దాన్ని రానివ్వండి."- అంటూ అక్కడ్నించి లేచా.

"ఏమిటీ! ఈ ముసలాయన మీ అక్కని పెళ్ళాడేద్దావనే"— అంటున్నాడు రామకృష్ణ నా వెనకాలే వచ్చి. "ఆయన పెళ్లాడతాననంటం లేదు. వాళ్ళింట్లో గుట్టుగా మర్యాదగా ఉండమంటున్నాడు."-అన్నాను కసిగా. భవిష్యత్తులో కూడా ఆయన్ని ఎప్పుడూ 'మామయ్య' అని పిలవకూడదు అని మనసులో శపథం చేసుకొన్నాను.

*　　*　　*

"ఏమే కాళీ...."

అక్క పిలుపు. నా ప్రాణం లేచివచ్చింది. నన్ను కాళీ అని పిలిచేది అమలే.

"మీరు ఆ పిలుపు మార్చరా ఏవిటండీ!? మీ చెల్లెలు యిప్పుడు చాలా సాధువు. కాళీలా ఎప్పుడూ కనపడదు. ఆవిడ కరుణే!"- అంటూ రామకృష్ణ అమల వెనకాలే వంటింట్లోకి ప్రవేశించాడు. ఉత్తప్పుడు గ్లాసు మంచినీళ్ళ కోసం కూడా వంటింటి మొహం చూడడు అతను! అది మొహం కడుక్కుని, కాఫీ తాగి, నాకు వంటలో సాయం చేస్తున్నంతసేపూ రామకృష్ణ వంటిల్లు వదలనే లేదు, అమల నా వైపు చూసి నవ్వింది. నేను తల వంచుకున్నాను. నాకు తెలుసు! అమల చాలా తెలివైంది. ఒకవైపు అనంతం మామయ్య, మరోవైపు రామకృష్ణ కబుర్లు, జోకులు వేస్తూ యిల్లు అదరగొట్టారు. అమల అదంతా సినిమా చూసినట్లు చూసి ఆనందించింది. మధ్యమధ్యలో నేను విసుగొచ్చి నోరుమూసుకుంటే హెచ్చరించి మరీ ఉత్సాహం వచ్చేలా చేసింది.

ఆ ఇద్దరూ తమ మనస్సులో వెకిలితనాన్ని కప్పి పుచ్చుకుంటూ, మర్యాద ముసుగులో ఆడుతున్న నాటకం గ్రహించనంత అమాయకురాలు కాదు అమల. అమలను తన ఇంటికి రమ్మని అన్యాపదేశంగా ఆహ్వానించాడు మామయ్య. రిటైర య్యాక తప్పక వస్తానని హామీ యిచ్చింది అమల. ప్రాణం విసిగి వాళ్ళిద్దరూ బజారు కెళ్ళిం తరువాత మేం తీరుబడిగా కూర్చోగలిగాం.

'ఏమిటీ విశేషాలు!' అన్నది అమల.

అమలవైపు చూశాను. ఎప్పటిలా తెల్లని చీరెలో స్వచ్ఛంగా ఉంది. ముందర వైపు తెల్ల వెంట్రుకలు కనబడుతున్నాయి. నలభై దాటుతుంది తనకి. "ఏం వున్నాయ్....!"- అన్నాను నవ్వేసి.

"ఏం నంగనాచివే. వాళ్ళిద్దరూ నాపైన చేసినదాడి చూశాకకూడా నీకు విశే షం కనిపించలేదా ??"....అన్నది.

నాకు కళ్ళనీళ్ళు వచ్చాయి. రామకృష్ణను నేనేమీ అనలేకపోయాను. చివరకు అక్కే ఓదార్చింది.

"నీ మొహం ఎందుకు ఏడవటం? నేను హాయిగానే వున్నాను! ఆ హాయిని భరించలేకనే యిదిగో యిలాటి యిబ్బందులన్నీ!" అన్నది నవ్వేస్తూ.

పిన్ని వ్రాసిన ఉత్తరం, రామకృష్ణ కబుర్లు అన్నీ చెప్పాను. అంతా విని "నువ్వేమనుకొంటున్నావు?"- అంది.

"నేనేమనుకుంటాను....!" అక్క చెప్పుకొచ్చింది పాత సంగతులన్నీను. శ్రీశైలం వెళ్ళిందట. రెండురోజులు ప్రశాంతంగా అక్కడ వుండాలని ప్లాను. ఆ వేళకి వాళ్ళ మేనేజర్ కూడా ఫ్యామిలీతో దిగాడట, అంతా కలిసి కులాసాగా తిరి గారు. ఆ సమయానికి రామం, వాడి భార్య వచ్చారట. వెంటనే ఇది ఉంటున్న బంగళా ఖాళీచేసి వాళ్ళతో వెళ్ళలేదట. నేను అన్నీ చూశాను. మీరు వెళ్ళరండి అన్నదట. అంతే యింటికి వచ్చిన దగ్గరనుంచి రణరంగం.

తనకూ, ఆయనకూ ఎలాంటి సంబంధమూ లేదని మొత్తుకున్నా వినలేదట! పిన్ని ఏకంగా ప్రాయోపవేశం చేస్తానందిట! సరిగ్గా అప్పుడే అనిపించిందట 'ఆ మేనేజర్ అందంగా ఉన్నాడ'ని. తనంటే ఎంతో అభిమానం చూపిస్తున్నాడనీ. ఎన్నో ఏళ్ళ నుంచి స్నేహం. ఎప్పుడూ హద్దులు దాటి మాట్లాడి ఎరుగడట! ఆయన కళ్ళలో తనపట్ల వున్న అనురాగం కొత్తగా రామంగాడు తిట్టిన తరువాతే అర్థం అయిందట.

అంటూ కథ అంతా చెప్పుకొచ్చింది.

'ఇప్పుడు చెప్పవే కాశీ! ఇన్నేళ్ళు ఆ రామం గాడినీ, చిన్నతల్లినీ పెద్దవాళ్ళని

చేయటం కోసమే జీవితం ఖర్చు పెట్టాను. ఇప్పుడిక వాళ్ళ పిల్లలకోసం నేను నడుం కట్టాలా?! అసలు వాళ్ళేవసుకుంటున్నారే నన్ను! నీ మొగుడు చూడు. మామయ్య వరస చూడు, వాళ్ళ కబుర్లు వింటుంటే ఒక్కోణ్ని పుటం వెయ్యాలనిపించటం లేదూ. పెళ్ళి పెటాకులూలేకుండా ఉన్నానని, ఎవడికి పడితే వాడికి అందుబాటులో వుంటానని ఎంత లేకి ఆలోచనో చూడు. విశ్వం అదే మా మేనేజర్ నన్ను ఏదో అన్యాయం చేస్తాడని వాళ్ళ బాధ. అతను నాకు చేయగలిగే అన్యాయం ప్రత్యేకంగా ఏదీలేదు. ఏదన్నా అన్యాయం అంటూ వుంటే, అది నాకు నేనే చేసుకున్నా. నా వుద్యోగం నాకుంది. ఇప్పుడొచ్చే జీతంలో సగం ఖర్చుచేసినా నాకు హాయిగా గడిచి పోతుంది. నువ్వు చెప్పు. విశ్వం నాకు కొత్తగా చేయగలిగే అన్యాయం ఏముం టుంది. పరువు పోతుందని అమ్మ బాధ. నాకు వచ్చే జీతం, పెన్షనూ తనకి దక్కదే మోనని రామంగాడి బాధ. దాని కూతుర్ని నేను పెంపుడు తీసుకోలేదని చెల్లాయి బాధ.

ఇంక మాట్లాడలేకపోయింది అమల. నేను అమల చేయి అందుకొన్నాను. మృదువుగా మెత్తగా ఉంది. అమల కళ్ళెత్తి నావైపు చూసింది. ఆ కళ్ళలో తీరని వేదన. అవును దానికేం మిగిలింది....! మనిషిలా లేదు. యంత్రంలా బ్రతుకుతోంది అది.

'విశ్వానికి నేనంటే ఎంతో అభిమానం'- అన్నది వట్టి బేలలాగా. నేను నవ్వాను. అమల వెళ్ళాక పిన్నికి ఉత్తరం వ్రాశాను సమాధానంగా మా అమ్మ, పిన్ని యిద్దరూ వచ్చారు. ఇద్దరూ కలిసి నన్ను తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టిపోశారు.

"గౌరవం, పరువూ, ప్రతిష్టాపోగొట్టుకొని వాడికి ఉంపుడుగత్తెలా పడి వుం డాల్సిన రాత అమల మొహాన్ని రాసిపెట్టి వుంటే దేవుడైనా చెరపలేడట! ఊరూ, వాడా కోడై కూస్తున్నా, దానికి సిగ్గు, బిడియం లేవట. లక్షణంగా రామా-కృష్ణ అనుకుంటూ రామంగాడి పిల్లాడిని పెట్టుకుని'....

మా పిన్ని యింకా తిడుతూనే ఉంది. నేనేమీ సమాధానం చెప్పలేదు. చెప్పా ల్సిన అవసరమూలేదు. ఏ అనుభూతికీ నోచుకోకుండా మోడులా బతికిందది. ఇప్ప టికైనా ఆ మోడు చిగురిస్తే దాని జీవితంలో కాస్త వసంతం తొంగిచూస్తే దాన్ని కాదనే హక్కు నాకేం వుంది?

దాని ఆనందం కంటే నాకు కావలసిందేముంది ?

*

(సిరివెన్నెల : సంసార పక్ష పత్రిక)